గోతులకే దిక్కులేదు.. రోడ్లేస్తారా!

- గతుకులు పూడ్చివేత.. ప్రచార ఆర్భాటమే!
- పలు గ్రామాలలో ప్రధాన రహదారులూ ఛిద్రం
- మొక్కుబడి తంతుగా సాగుతున్న మరమ్మతులు

కాకినాడ రూరల్: తాము అధికారంలోకి వస్తే రహదారులను అద్దాల్లా తయారు చేస్తామని నమ్మబలికిన కూటమి నేతలు మాట తప్పారు. పగ్గాలు చేపట్టి ఏడు నెలలవుతున్నా రహదారులు కాదు కదా కనీసం గుంతలు కూడా పూడ్చలేదు. వర్షాకాలంలో తుపానులు, అధిక వర్షాలకు రహదారులు ఛిద్రంగా మారాయి. కాకినాడ డెయిరీ ఫారమ్ సెంటర్ నుంచి పోర్టులకు వేళ్లే ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉన్న కుంభాభిషేకం రోడ్డుపై చిన్నచూపు చూస్తున్నారు. ఈ మార్గంలో ప్రజలతో పాటు పలు పరిశ్రమలు, పోర్టులకు వెళ్లే వారితో పాటు మత్స్యకారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రోడ్డు పాడవడంతో వాహనచోదకులు తరచు ప్రమాదాలకు గురవుతున్నారు. ఏదో నామ మాత్రంగా పూడ్చిన గోతుల నుంచి కంకర చిప్స్ అప్పుడే పైకి లేస్తున్నాయి. ఈ రహదారి ప్రాంతంలో ఉన్న గొడౌన్ల నుంచి పోర్టుకు బియ్యం లోడుతో లారీలు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో పెద్ద గోతుల వద్ద అవి పక్కకు ఒరిగిపోతుండడంతో పక్కనే ప్రయాణాలు సాగించే ద్విచక్ర వాహన చోదకులు హడలిపోతున్నారు. కుంభాభిషేకం రోడ్డును పూర్తి స్థాయిలో నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


సర్పవరం గ్రామంలో ప్రమాదభరితంగా ఉన్న గొయ్యి

కొన్ని గ్రామాలలో పనులు

సంక్రాంతి నాటికి రహదారులు గతుకులు పూడ్చాలని ప్రభుత్వం ఆదేశించినట్టు ప్రచారం జరుతున్నా క్షేత్రస్థాయిలో కొన్ని గ్రామాలకే పనులు పరిమితమయ్యాయి. నియోజకవర్గ పరిధిలో రూరల్ మండలంతో పాటు కరప మండలంలో మొత్తం సుమారుగా 120 కిలో మీటర్ల మేర ఆర్ అండ్ బీ, 50 కిలో మీటర్ల మేర పంచాయతీ రాజ్ రోడ్లు విస్తరించి ఉన్నాయి. సర్పవరంలో మాధవపట్నం నుంచి భావనారాయణ స్వామి గుడి వరకు గోతుల పూడ్చివేత చేపట్టి మిగిలిన పనులు అలాగే వదిలేశారు. భావనారాయణ స్వామి గుడి నుంచి సర్పవరం జంక్షన్ వరకు రహదారి పూర్తిగా ఛిద్రమైంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. సర్పవరంలో చిన్న ముక్కతో పాటు గురజనాపల్లి, కరప రోడ్లలో మాత్రమే గతుకులు పూడ్చారు.

సంక్రాంతి నాటికి పూర్తిచేస్తాం

సంక్రాంతి నాటికి రహదారుల్లో గతుకులు పూడ్చివేస్తాం. వర్షాల వల్ల పనుల్లో జాప్యం జరిగింది. సర్పవరం రోడ్డులో చిన్న బిట్‌లో పనులు చేపట్టాం. మిగిలిన పనులకు కాంట్రాక్టరు ఇటీవల టెండరు వేశారు. పనులు ప్రారంభిస్తాం.

– లోవరాజు, ఏఈ, ఆర్అండ్‌బీ, కాకినాడ రూరల్


ఆర్టీఓ కార్యాలయం నుంచి వచ్చే రోడ్డులో వలసపాకల జంక్షన్‌లో..


కుంభాభిషేకానికి వెళ్లే మార్గంలో మొక్కుబడిగా పూడ్చిన గొయ్యి


దుమ్ములపేట నుంచి కుంభాభిషేకం వెళ్లే మార్గంలో వదిలేసిన గొయ్యి..

క్లుప్తంగా

ఏపీజీఏ టేబుల్ క్యాలెండర్ ప్రారంభం


ఏపీజీఏ టేబుల్ క్యాలెండర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ఏపీజీఏ జిల్లా టేబుల్ క్యాలెండర్–2025ని కలెక్టర్ షణ్మోహన్ బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎం జగన్నాథం, కార్యదర్శి జ్యోతుల రాంబాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ అసన్ రతన్‌రాజు, సంయుక్త కార్యదర్శి ప్రకాష్, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, సి శ్రీనివాసర్, తేజ, సతీష్, ప్రభారాణి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ


పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ రమేష్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పీఆర్‌టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆంగ్ల నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీను బుధవారం ఆవిష్కరించారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈఓ పిల్లి రమేష్ క్యాలెండర్‌ను, సమగ్రశిక్ష ఏపీసీ పి.వేణుగోపాల్ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షులు చింతాడ ప్రదీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బండి సూకరాజు, నాయకులు సీహెచ్ శ్రీనివాస్, వాకడ చిన్న, సూర్యనాగేశ్వరరావు పాల్గొన్నారు.

మానవజాతి పెద్ద కుటుంబం

బోట్‌క్లబ్: మానవజాతి అంతా పెద్ద కుటుంబమని కాకినాడ ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అద్దాల సత్యనారాయణ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కుటుంబ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులందరికీ మొక్కలు అందచేశారు. ఏటా జనవరి 1న నిర్వహించే గ్లోబల్ ఫ్యామిలీ డే ప్రపంచానికి ఐక్యత సానుకూల సందేశంతో కొత్త సంవత్సరాన్ని ప్రారంభిస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా సంస్కృతులు, మతాలు భిన్నంగా ఉండవచ్చు కానీ, మానవజాతి అంతా ఒక పెద్ద కుటుంబం అని, అది ఐక్యంగా ఉంటేనే మనుగడ సాగించగలదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వెంకటపతి, గాయత్రి, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

బలరామునిగా సీతారామస్వామి



బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రతమహోత్సవాలు, రజిత దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న సీతారామస్వామి బుధవారం బలరామ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి ఉదయం అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ బదిలీ


బదిలీ అయిన సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌ను సత్కరించిన మేనేజర్ రమేష్

సామర్లకోట: స్థానిక రైల్వే సీనియర్ చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు ఏవీఎస్ సంతోష్‌కుమార్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ ఆధ్వర్యంలో వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసి ఆయన సేవలను కొనియాడారు. సుమారు మూడేళ్ల పాటు స్థానిక రైల్వేలో పని చేసిన ఆయన విజయవాడ సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరుగా బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయన స్థానంలో యలమంచి నుంచి మహేష్ బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. బదిలీ అయిన సంతోష్‌కుమార్‌కు రైల్వే స్టేషన్ మేనేజరు ఎం రమేష్ రిలీవింగ్ ఆర్డర్‌ను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు గిరి, ఎస్ఎస్ అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుడుపూడికి ఘనంగా నివాళులు


కుడుపూడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: కార్మిక నేత కుడుపూడి సూర్యనారాయణ 22వ వర్ధంతి సందర్భంగా బుధవారం కాకినాడ సుందరయ్యభవన్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కరణం ప్రసాదరావు, అయితాబత్తుల రామేశ్వరరావు, జి బేబీరాణి, కె సత్తిరాజులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్న సూర్యనారాయణ పని చేసిన ప్రతి చోటా అభ్యుదయ భావాల వ్యాప్తికి కృషి చేశారన్నారు. సీపీఎం ఇంద్రపాలెం గ్రామశాఖ కార్యదర్శిగా, కాకినాడ పట్టణ కమిటీ సభ్యులుగా సూర్యనారాయణ ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఎర్రజెండాకే వన్నె తెచ్చిన సూర్యనారాయణ స్ఫూర్తితో కాకినాడ నగరంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పలివెల వీరబాబు, సీహెచ్ రాజ్‌కుమార్, సీహెచ్ రమణి, మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణలతో పాటు కె.వీరబాబు, కె.సత్తిబాబు, పాలిక రాజేంద్రప్రసాద్, చంద్రావతి, వీరవేణి, బేబీ తదితరులు పాల్గొన్నారు.

భీమా కోరేగావ్ స్ఫూర్తిని కొనసాగిద్దాం

కాకినాడ సిటీ: భీమా కోరేగావ్ శౌర్య దివస్‌ను బుధవారం కాకినాడలో దళిత ప్రజా సంఘాలు, కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సామాజిక న్యాయ సాధన సమితి నాయకులు డాక్టర్ మోకా పవన్‌కుమార్ అధ్యక్షతన దళిత నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, సామాజిక న్యాయ సాధన సమితి నాయకులు డాక్టర్ భానుమతి, కేవీపీఎస్ నాయకులు మోర్త రాజశేఖర్, కెఎస్ శ్రీనివాస్, దళిత నాయకులు పిల్లి రామారావు పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అంటరానితనం, కులవివక్షతలకు వ్యతిరేకంగా మనుషులు అందరిని సమానంగా చూసే రాజ్యాంగాన్ని అందించారని, నేడు దేశంలో బీజేపీ పాలనలో తిరిగి పీష్వా కాలం నాటి పరిస్థితులు తీసుకురావడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు


గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు

బోట్‌క్లబ్: నూతన సంవత్సరం కావడంతో బుధవారం నగరంలో పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ధనుర్మాసం కావడంతో నగరంలోని విష్ణాలయాలతో పాటు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడాల్సి వచ్చింది. స్థానిక జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో దర్శనం కోసం తెల్లవారుజాము నుంచి భక్తులు పోటెత్తారు. స్థానిక గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలోను ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. స్థానిక వెంకట్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలోను, మెయిన్‌రోడ్డు సీతారామస్వామి ఆలయంలోను, దేవాలయంవీధిలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలోను భక్తులు పోటెత్తారు.

భోగి గణపతి పీఠంలో..

నూతన సంవత్సరం సందర్భంగా భోగి గణపతి పీఠంలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మాఘమాసం నుంచి భోగి గణపతి పీఠంలో త్రినాథ వ్రతం జరుగుతుందని పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు తెలిపారు. శ్రీవారి సేవా సమాజం ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో ఆదివారం సాయంత్రం త్రినాథ వ్రతం జరుగుతుందన్నారు.


ప్రత్యేక అలంకరణలో భోగి గణపతి స్వామివారు

వ్యక్తిత్వంతోనే మనిషి ఉనికి

బోట్‌క్లబ్: నూతన సంవత్సరం అందరికీ ఉత్తేజం కలిగించడానికి ప్రయత్నించే వారికి ఫలితం వచ్చేలా, వారిలో వ్యక్తిత్వ వికాసానికి ఉపకరించేలా జీవన నైపుణ్యాలు పుస్తకం ఎంతోగానో ఉపయోగపడుతుందని అలయెన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు పాలపర్తి సుబ్బారావు అన్నారు. స్థానిక అలయెన్స్ క్లబ్ కార్యాలయంలో బుధవారం క్లబ్ వైస్ గవర్నర్, రచయిత వింజరపు జనార్దనం రచించిన జీవన నైపుణ్యాలు పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసంతో మనిషి ఉనికి చాటుకోవాలన్నారు. పుస్తక రచయిత వ్యక్తిత్వ వికాస ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషన్ డైరెక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి, క్లబ్ అధ్యక్షులు వరాహ నరసింహమూర్తి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


జీవన నైపుణ్యాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అలయెన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు సుబ్బారావు

బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలు నిలిపివేత


ఉప్పాడ బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలు నిలిపివేసిన పోలీసులు

కొత్తపల్లి: నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ఉప్పాడ బీచ్‌కు పర్యాటకులు పోటెత్తారు. ఉదయం నుంచి వేలాది వాహనాల్లో పర్యాటకులు తరలిరావడంతో బీచ్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో బీచ్ రోడ్డులో రాకపోకల రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. ఉప్పాడ బీచ్ రోడ్డులో నుంచి వాహనాలను పిఠాపురం వైపుగా దారి మళ్లించారు. పోలీసులు ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్, వాకలపూడి లైట్ హౌస్ వద్ద వాహనాలను దారి మళ్లిస్తున్నారు.

నేడు మాండవ్య నారాయణుని కల్యాణం


సామర్లకోటలోని మాండవ్య నారాయణస్వామి ఆలయం

సామర్లకోట: స్థానిక శ్రీ, భూ సమేత మాండవ్యనారాయణుని కల్యాణం గురువారం నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు రఘురామ్ ఆచార్యులు తెలిపారు. ఆలయంలో గత నెల 16 నుంచి ప్రారంభమైన ధనుర్మాస పూజలు ఈ నెల 13 వరకు సాగనున్నాయి. పదో తేదీన ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారి దర్శనాన్ని ఉత్తర ద్వారం నుంచి కల్పిస్తారని అర్చకులు తెలిపారు. 13న భోగి పండగను పురస్కరించుకుని గోదా కల్యాణం నిర్వహించనున్నారు.


గ్రామోత్సవంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

భక్తి శ్రద్ధలతో గ్రామోత్సవం

బుధవారం సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం భక్తి శ్రద్ధలతో ప్రారంభమైంది. ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి స్టేషన్ సెంటర్, గాంధీచౌక్, చిన్నవీధి, పెద్దవీధి, యార్లగడ్డ వారి వీధి, నీలమ్మచెరువు, మఠంసెంటర్, అయోధ్యరామ పురం, కొత్తూరు నుంచి రాత్రికి గ్రామోత్సవం ఆలయంకు చేరింది.

ఉత్సాహంగా న్యూ ఇయర్ వేడుకలు

- నాయకులకు కార్యకర్తలు, అభిమానులు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు
- పార్టీ కార్యాలయాల వద్ద సందడే సందడి

కరప: మండలంలో న్యూ ఇయర్ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. బుధవారం ఉదయాన్నే పిల్లలు గ్రీటింగ్‌కార్డులు, చాక్లెట్‌లు చేతపట్టుకుని స్నేహితులకు ఇచ్చుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కాకినాడ వెళ్లి తమ నాయకుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబును, ప్రముఖ సినీ దర్శకుడు కురసాల కళ్యాణకృష్ణను కల్సి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాజీమంత్రి కన్నబాబును కల్సి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు కాకినాడలో ఎంపీ తంగెళ్ల ఉదయ్‌భాస్కర్, ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్తిబాబు తదితరులను గ్రీటింగ్స్ తెలిపారు. చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీడీఓ ఎం.అనుపమలను మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శులు, రేషన్ డీలర్లు, ఉపాధి సిబ్బంది, వివిధశాఖల అధికారులు కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ఎంపీపీ, జెడ్పీటీసీలు న్యూఇయ్యర్ కేక్‌కట్ చేసి, అందరికీ పంచారు.


రమణయ్యపేట వైద్యనగర్‌లో న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా గజమాలతో మాజీ మంత్రి కురసాల కన్నబాబును సత్కరిస్తున్న అభిమానులు

కన్నబాబు ఇంట..

కాకినాడ రూరల్: నూతన సంవత్సర వేడుకలను నియోజకవర్గ ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు రమణయ్యపేట వైద్యనగర్‌లోని కార్యాలయం వద్ద వేడుకల్లో పాల్గొన్నారు. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, అభిమానులతో పాటు జిల్లాలోని పలు నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వచ్చారు. గజమాలలతో కన్నబాబును సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కన్నబాబుకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో జిల్లా పార్టీ నాయకులతో పాటు నియోజకవర్గానికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ గీసాల శ్రీనివాస్, గంగనాపల్లికి చెందిన గీసాల శ్రీను, నేమాం సర్పంచ్ రామదేవు చిన్న తదితరులు ఉన్నారు.

నేతల ఇంట సందడి

కాకినాడ విద్యుత్‌నగర్‌లో ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, గొడారిగుంటలో ఎమ్మెల్యే పంతం నానాజీ, వలసపాకలలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్తిబాబు దంపతులు, వలసపాకలలో జెడ్పీటీసీ నులుకుర్తి రామకృష్ణ, టీడీపీ నాయకులు కటకంశెట్టి బాబి, పెంకే శ్రీనివాసబాబా, వాసిరెడ్డి ఏసుదాసు తదితరులు తమ నివాసాల వద్ద న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు.


ఉమా మనో వికాస కేంద్రంలోని దివ్యాంగులతో న్యూ ఇయర్ వేడుకల్లో జేసీ రాహుల్ మీనా

న్యూయర్ వేడుకల్లో దివ్యాంగులు

వాకలపూడి ఉమామనోవికాస కేంద్రానికి చెందిన దివ్యాంగులు అధికారులతో న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొన్నారు. ఉమామనోవికాస కేంద్రం ఈడీ పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా, ఆర్డీవో మల్లిబాబు తదితరులు వేర్వేరుగా వేడుకల్లో పాల్గొన్నారు.


కరప మండల పరిషత్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సుబ్బారావు


దారాలతో తయారు చేసిన కన్నబాబు చిత్రపటాన్ని బహూకరిస్తున్న అభిమాని చక్రధర్

దేశాభివృద్ధిలో జిల్లా భూమిక కీలకం

కలెక్టర్ షణ్మోహన్

ఆనంద నిలయంలో న్యూ ఇయర్ వేడుకలు

కాకినాడ సిటీ: నూతన సంవత్సరంలో కాకినాడ జిల్లా అందరి భాగస్వామ్యంతో అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించి, దేశ రాష్ట్ర అభివృద్ధిలో కీలక భూమిక పోషించగలదని కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆకాంక్షించారు. బుధవారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల వద్ద ఉన్న సాంఘిక సంక్షేమశాఖకు చెందిన ఆనంద నిలయం వసతి గృహం విద్యార్థుల నడుమ సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి జేడీ జి.శ్రీనివాసరావు ఇతర అధికారులతో కలసి ఆయన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పండ్లు ఇతర వస్తువులు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ కమిషనర్ భావన, జేసీ రాహుల్ మీనా, డీఆర్వో జె.వెంకటరావు, కలెక్టరేట్ సిబ్బంది, పలు ఉద్యోగ సంఘాల నాయకులు, ఉన్నతాధికారులు, పలువురు రెవెన్యూ, పోలీస్ ఉన్నతాధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పురోహితులు, వేదపండితులు కలెక్టర్ షణ్మోహన్‌కు ఆశీర్వచనాలు అందజేశారు.


ఆనంద నిలయం విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న కలెక్టర్ షణ్మోహన్